క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి

కదిరి అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డికి ఆదివారం ఆయన నివాసంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లా ప్రజా రవాణా అధికారి ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. మోటారు వాహన చట్టం మేరకు కాకుండా అధిక పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల బకాయిలు ఇప్పించకుండా అక్రమ బదిలీలు, చార్జీషీట్లు, సస్పెన్షన్లు చేస్తున్నారని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరించి, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణ, రీజనల్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గంగన్న, రామకృష్ణ, బైరిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వ్యవసాయ గిడ్డంగి నిర్మాణం



తాడిమర్రి: మండల కేంద్రంలో వ్యవసాయ గిడ్డంగి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.40 లక్షల నాబార్డు నిధులతో స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం ఎదురుగా ఉన్న నల్ల గుట్టపై వ్యవసాయ గిడ్డంగిని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఇక పైపులు, రేకులు బిగించడం, ప్లాట్‌ఫార్మ్ వేయడం తదితర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. గిడ్డంగి నిర్మాణంతో పంటలను ఆరబెట్టుకునేందుకు, నిల్వ చేసేందుకు సమస్య తీరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆర్‌సీపీ నాయకులు

ఓడీ చెరువు: వైఎస్సార్ జిల్లాలో ఈనెల 29, 30 తేదీలో జరగనున్న ఆర్‌సీపీ (రాయలసీమ కమ్యూనిస్ట్ పార్టీ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఆర్‌సీపీ మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి దేవర నాగన్న, టీఎండీ ఇలియాజ్, ఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్ హాజరయ్యారు. బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి పేరిట కుట్రలు చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ద్రోహం చేయడానికి యూసీసీ చట్టం తీసుకువస్తోందని ఆరోపించారు. ఆర్‌సీపీ నాయకులు మున్నా, అంజినమ్మ, వెంకటలక్ష్మమ్మ, పాల్గొన్నారు.

ముస్లింల పక్షపాతి సీఎం జగన్



పథకాల కరపత్రాలను చూపుతున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నూరుల్లా

నల్లచెరువు: మండల పరిధిలోని ఉప్పార్ల పల్లి, గాజేఖాన్ పల్లి, మల్లిరెడ్డి పల్లి గ్రామాల్లో మసీదుల్లో ఆదివారం హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మొగల్ నూరుల్లా ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల్లో వివిధ పథకాల ద్వారా సుమారు రూ.12 వేల కోట్లు ముస్లిం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాషా ఖాన్, ముతవల్లీలు బట్టీ హైదర్ వలి, హైదర్ వలి ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

వర్షం కురవాలని పూజలు



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు గ్రామంలో ఆదివారం వర్షాలు సకాలంలో కురవాలంటూ గంగమ్మ దేవతకు గ్రామస్తులు బోనాలు పట్టారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఉదయమే బోనాలు ఎత్తుకుని పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామం సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు.

చంద్రబాబు మాయలో పడొద్దు

- అబద్ధపు హామీలతో మోసం చేసేందుకు కుట్రలు
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమైందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వంకరకుంట గ్రామంలో ఆదివారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నవరత్నాల్లోని పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ఆ కుటుంబాలకు చేకూరిన పథకాల లబ్ధిని తెలియజేస్తూ బుక్‌లెట్లు అందజేశారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, వృద్ధులు, రైతులు, మహిళలు, చేనేత కార్మికులు, కర్షకులు ఇలా ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ల నియామకం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే చేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. సంక్షేమ సారథి, సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్కో కుటుంబానికి ఒకటి కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో లేనిపోని అబద్ధపు హామీలతో చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బాబు మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. 2014లో 600లకు పైగా అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. టీడీపీ బూటకపు హామీలను నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరన్నారు.

తూకాలు కరెక్ట్‌గా ఇస్తున్నారా

వంకరకుంట గ్రామంలో వాహనంలో ఇస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనిఖీ చేశారు. సరుకుల కోసం బండి వద్దకు వచ్చిన మహిళలతో ఎమ్మెల్యే మాట్లాడారు. అక్కా.. తూకాలు కరెక్ట్‌గా ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. అప్పటికే తూకం వేసి పక్కన ఉంచిన సరుకుల సంచిని తిరిగి తక్కెడ (స్కేల్)పై ఉంచి తూకం సరి చూశారు. రాయితీపై పంపిణీ చేస్తున్న రాగులను పరిశీలించి బాగున్నాయంటూ సంతృప్తి వ్యక్తం చేశారు.

చిన్నారులతో సరదాగా..

అంతకుముందు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఓ ఇంటి ముందు అరుగుపై చిన్నారులతో కలిసి సినిమా హీరోల బొమ్మలతో కూడిన పేక ముక్కలతో ఆడుకున్నారు. చిన్నారుల పేర్లు అడిగి తెలుసుకుని బాగా చదువుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ మిలటరీ కుళ్లాయప్ప, ఎంపీటీసీ సుగుణమ్మ, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, మండల కన్వీనర్ కుళ్లాయి నాయక్, మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, నాయకులు టీడీ విజయశేఖర్ రెడ్డి, ఓబిరెడ్డి, అరవిందరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, హెచ్ ఓబిరెడ్డి, శివారెడ్డి, నాగేశ్వరరావు, కె.ఓబిరెడ్డి, రమణ, అంజి నాయక్, చిన్న నాగప్ప, ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ దేవేంద్రనాయక్, హౌసింగ్ ఏఈ వరుణ్ తదితర అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక..

నల్లమాడ: మండలంలోని వంకరకుంట గ్రామంలో టీడీపీకి చెందిన పలువురు ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. జక్కా నాగేశ్వర్, జక్కా శ్రీనివాస్, పెద్దకోట్ల కేశవ వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా టీడీపీలో పని చేస్తున్నా ఎలాంటి గుర్తింపు లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పనితీరుకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గాండ్లపెంట: కటారుపల్లి సచివాలయ పరిధిలోని గొల్లపల్లి నుంచి సోమవారం ఉదయం 7 గంటలకు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపడుతున్నట్లు కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆదివారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు.

బసిరెడ్డిపల్లి, సానేవారిపల్లి గ్రామాల్లో..

నల్లమాడ: వంకరకుంట సచివాలయ పరిధిలోని బసిరెడ్డిపల్లి, సానేవారిపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 7:30 గంటలకు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొని సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తారన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి అక్కడికక్కడే చర్యలు తీసుకుంటారన్నారు.

రేపు తలమర్లవాండ్ల పల్లిలో..

నల్లచెరువు: ఈనెల 11వ తేదీన తలమర్లవాండ్ల పల్లి సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు దేవిరెడ్డి పల్లి నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీఓ సౌజన్యకుమారి తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలు తమకు సంబంధించిన 11 సమస్యలపై వినతిపత్రాలు అందజేయాలన్నారు. వాటికి అక్కడే పరిష్కారం చూపుతారన్నారు

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్‌యార్డు సబ్‌స్టేషన్‌లో ఈనెల 11వ తేదీన నిర్వహించే ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విద్యుత్ అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు.

సత్యసాయి సేవలో తరించండి



ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

పుట్టపర్తి అర్బన్: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకుని సత్యసాయి సేవలో తరించాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. ఆదివారం సత్యసాయి మహాసమాధి దర్శనానికి విచ్చేసిన దక్షిణాఫ్రికా, మారిషస్, మొరాకో, ఇథియోపియా, సీషెల్స్ దేశాలకు చెందిన సత్యసాయి భక్తులతో కలిసి జగరాజుపల్లిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పాఠశాల ఆవరణలో గ్రామస్తులు, విదేశీయులతో కలిసి 108 కొబ్బరి, వేప, రావి తదితర మొక్కలు నాటారు. గ్రామంలోని దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. వందలాది మంది పేదలకు నిత్యావసరాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌జే రత్నాకర్ మాట్లాడారు. ప్రకృతి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పర్యావరణాన్ని కలుషితం చేయకుండా కాపాడాలన్నారు. అనంతరం నగర సంకీర్తన, వేద పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మెన్లు సత్యపాలన్, సౌత్రినాయుడు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: మండలంలోని నిడిమామిడి గ్రామంలో టీడీపీ గట్టి షాక్ తగిలింది. వైఎస్సార్‌సీపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆదివారం పలువురు టీడీపీ కీలక వ్యక్తులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో రహంతుల్లా, వేణుగోపాల్, చిరంజీవి కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. శ్రీధర్‌రెడ్డి గెలుపునకు నిర్విరామంగా పని చేస్తామని పేర్కొన్నారు. ఎన్నడూ లేనంతగా పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగన్న, నాయకులు నంజిరెడ్డి, మహేశ్వరరెడ్డి, పాలగోవిందు, లాయర్ సుభాష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బోర్లతో రైతన్నలకు ఊరట



తగరకుంటలో ఉచిత బోర్ల తవ్వకాన్ని పరిశీలిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: తోపుదుర్తి చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేపట్టిన ఉచిత బోర్ల కార్యక్రమంలో రైతన్నలకు ఊరట లభిస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని తగరకుంటలో ఆయన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, అగ్రీ బోర్డు చైర్మన్ వెంకటరాముడుతో కలిసి ఉచిత బోర్ల కార్యక్రమాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ కనగానపల్లి, నరసంపల్లి గ్రామాల్లో సుమారు 65 మంది రైతులకు బోర్లు వేశారని, ప్రస్తుతం తగరకుంట గ్రామంలో రెండు రోజులుగా 10 మంది రైతులకు బోర్లు తవ్వారన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు నాగముని, భాస్కరరెడ్డి, రమణారెడ్డి, నారాయణస్వామి, మాధవరెడ్డి, మహేష్‌రెడ్డి, చంద్రశేఖర్, అంజన్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన అంజి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని వీవర్స్ కాలనీ సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు.. పట్టణానికి చెందిన బాబు తన ద్విచక్ర వాహనంలో గట్లు వైపునకు బయలుదేరాడు. ప్రమాదవశాత్తూ కుక్క అడ్డుగా రావడంతో తప్పించబోయి కిందపడ్డాడు. గాయపడిన అతడు కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

కదిరి టౌన్: పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో నల్లచెరువు మండలం బాలేపల్లి తండాకు చెందిన అంజి అనే యువకుడికి గాయాలయ్యాయి. కుటాగుల వైపు నుంచి బాలేపల్లి తండాకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష ఫీజు కట్టించుకోవాలి

ధర్మవరం అర్బన్: డిగ్రీ కళాశాల విద్యార్థులకు కళాశాల ఫీజుతో సంబంధం లేకుండా పరీక్ష ఫీజు కట్టించుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతలయ్య కోరారు. పట్టణంలోని బీసీ బాలుర సంక్షేమ హాస్టల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యం ఫీజుల కోసం విద్యార్థులను నానా రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. అలాంటి కళాశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. మురళి, యాసిన్, చరణ్, విజయ్ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో ప్రార్థనలు

ధర్మవరం రూరల్: గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథల సంక్షేమం, ఆరోగ్యం కోసం ఆదివారం క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. క్యాథలిక్ చర్చి ఫాస్టర్ పసల జోసెఫ్, జాన్‌రెడ్డి, చిన్నమ్మ, ప్రకాష్, మేరి, ఉదయ్, వినయ్, మౌనిక, సరిత తదితరులు పాల్గొన్నారు.

16న బోయల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పట్టణంలో శిల్పారామంలో ఈనెల 16న వాల్మీకి, బోయ సంఘం ఆధ్వర్యంలో బోయల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం, తదితర అంశాలపై సూచనలు సలహాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న వాల్మీకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సలహాదారు ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు బోయ సాంబ, నాయకులు మోహన్, దనుంజయ, కేశవ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మకు బోనాల ఊరేగింపు



అలంకరణలో పెద్దమ్మ తల్లి



బోనాలు తీసుకొస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాలేవీధిలో ఉన్న పెద్దమ్మ తల్లికి ఆదివారం మహిళలు బోనాలు సమర్పించారు. అంతకుముందు పెద్దమ్మ తల్లి మూలవిరాట్‌ను అర్చకుడు వెంకటేష్ ప్రత్యేక ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. మహిళలు, విద్యార్థినులు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.

ప్రత్యేక పూజలు

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలోని పెద్దమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బోనాలు, కొబ్బరి కాయలు సమర్పించి పూజలు చేపట్టారు. ఆషాఢమాసం కావడంతో అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటు



విజయారెడ్డి



మహేష్



మల్లేష్



భాస్కర్‌రెడ్డి



ఓబిలేసు

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. బుక్కపట్నం మండలానికి సంబంధించిన కమిటీల జాబితాను ఆదివారం పార్టీ కార్యాలయం విడుదల చేసింది. మండల పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా రామసాగరానికి చెందిన సీనియర్ నాయకుడు విజయారెడ్డి, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా బుక్కపట్నానికి చెందిన పెనుజూరి మహేష్‌ను నియమించారు. మండల ప్రచార కమిటీ విభాగం అధ్యక్షుడిగా లింగప్పగారిపల్లికి చెందిన మల్లేష్, లీగల్ సెల్ అధ్యక్షుడిగా కష్టాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, సేవాదళ్ విభాగం మండల అధ్యక్షుడిగా బుక్కపట్నానికి చెందిన కందుకూరి ఓబిలేసును నియమించారు. వీరితో పాటు ప్రతి కమిటీలోనూ ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు మొత్తం 20 నుంచి 28 మంది ఉంటారన్నారు. తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి నూతన కమిటీల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు



దాతలను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: నిరుపేదలకు కంటి చూపును అందించేందుకు ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతి ప్రాంగణంలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటిచూపు తగ్గిన వారికి కంటి వైద్య పరీక్షలు చేశారు. 228 మంది కంటి పరీక్షలు చేయించుకోగా కంటి ఆపరేషన్లకు 129 మందిని ఎంపిక చేశారు. కంటి ఆపరేషన్లను కూడా బెంగళూరుకు తీసుకెళ్లి చేయించనున్నామని రోటరీ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించిన దాతలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కోశాధికారి సుదర్శన్ గుప్తా, క్యాంప్ చైర్మన్ నరేంద్ర రెడ్డి, పెద్దారెడ్డి, సత్రసాల ప్రసన్న కుమార్, రమేష్‌బాబు, శివయ్య, కృష్ణమూర్తి, చలం, కళాజ్యోతి అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి రామకృష్ణ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



మాట్లాడుతున్న ఎస్‌ఐ హనుమంతరెడ్డి

కనగానపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో దాతల సహకారంతో కడప పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు అమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు అంకే అశోక్ తెలిపారు. వైద్యశిబిరాన్ని కనగానపల్లి ఎస్‌ఐ హనుమంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అంకే లక్ష్మన్న ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ సూర్యప్రకాష్, డాక్టరు ప్రభాకర్ ఆధ్వర్యంలో 220 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో సుమారు 150 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేసినట్లు నిర్వాహకులు అంకే తిప్పయ్య తెలిపారు. దాతల సహకారంతో భోజన ఏర్పాట్లు చేశారు. అరవింద్ అనే విద్యార్థి ఉన్నత విద్యకోసం దాత వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ అంకే అశోక్ రూ.30 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్య కళల అకాడమీ డైరెక్టర్ దాసరి ప్రభాకర్, రాప్తాడు మండల వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పరామర్శ

కదిరి అర్బన్: మండల పరిధిలోని కారెడ్డిపల్లికి చెందిన మధుకర్‌రెడ్డి సతీమణి, బ్రాహ్మణపల్లి ఎంపీటీసీ అంజనాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తల వెంకటరమణ తదితరులు మధుకర్‌రెడ్డిని పరామర్శించారు. అంజనాదేవి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు కేఎస్ బాహుద్దీన్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు లింగాల లోకేశ్వరరెడ్డి పలువురు పాల్గొన్నారు.

అమడగూరు: మండలంలోని జేకేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాగరాజు అమ్మ, ఎంపీటీసీ కోగర జయమ్మ అత్త నాగలక్ష్మమ్మ (78) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఫోన్‌లో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి చేరుకుని మృతురాలికి నివాళులర్పించారు. సోమవారం కందుకూరిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విశ్వ హిందూ పరిషత్ ఆశయాలపై అవగాహన

బత్తలపల్లి: హిందువులను వివిధ మతాలకు చెందిన వారు మతమార్పిడి చేయిస్తున్నారని దక్షిణాంధ్ర ప్రాంత సంయోజక్ తూముకుంట ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు పులిచెర్ల వేణుగోపాల్, ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆశయాలు, ధర్మాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గోసాయి హరిప్రసాద్, సహాయ కార్యదర్శి వేదవ్యాసు, కోశాధికారి జనార్దన్, సత్సంగం ప్రముఖ రామ్మోహన్, సేవా ప్రముఖ శ్రీనివాస నాయుడు, ధర్మాచార్య ప్రముఖ బైసాని శ్రీనివాస గుప్తా, బత్తలపల్లి ప్రఖండ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి కేశవనాయుడు, యోగానందాచారీ, వెంకటరమణ, విశ్వరూప, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

23న 'ప్రజా సింహగర్జన'

ఓడీ చెరువు: ఈనెల 23న గుంటూరులో జరిగే ప్రజా సింహగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని యాదవ సంఘం నాయకులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు వరప్రసాద్ యాదవ్, రాజగోపాల్, నాగరాజు యాదవ్, శివనారాయణ, రాము, శ్రీనివాసులు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.